క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయం ఉద్యోగులు కలిసి తమ పరిధిలోగల పింఛన్‌దారులకు శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పీ వెంకటనారాయణ సర్కిల్–3 పరిధిలోని రామలింగేశ్వరనగర్‌లో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ సర్కిల్–1 పరిధిలోని 20,392 పింఛన్లకుగాను 17,065మందికి, సర్కిల్–2 పరిధిలోని 25,392 పింఛన్‌దారులకుగాను 23,390 మందికి, సర్కిల్–3 పరిధిలోని 20,437 మంది లబ్ధిదారులకుగాను 17540 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు.

రంజాన్ మాస ప్రారంభ శుభాకాంక్షలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదరులకు ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కఠోర ఉపవాస దీక్షలతో సాగే రంజాన్‌మాసంలో సమాజంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన కృషి మరువురానిదని పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా జరిగిన మేలు గురించి గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తామని తెలిపారు. మైనార్టీల పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాత్రమే మంచి జరుగుతుందనే సత్యాన్ని కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల కాలంలోనే మైనార్టీలకు అనుభవమైందని పేర్కొన్నారు.

కేటాయింపులు నిరాశపరిచాయి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర బడ్జెట్‌లో పారిశ్రామికరంగానికి ప్రభుత్వ కేటాయింపులు నిరాశపరిచాయని విజయవాడ ఆటో క్లస్టర్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ ఫైనాన్స్ డైరెక్టర్ బాయన బాబూజీ (బాబ్జీ) అన్నారు. అంతేకాకుండా చాలా అంశాలకు బడ్జెట్ కేటాయింపులు అనుకున్న స్థాయిలో జరగలేదని తెలిపారు. పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కోసం రూ.12 వేల కోట్లు కేటాయింపులు చూపించినా, వివిధ పరిశ్రమ కారిడార్లకు కలిపి మొత్తం కేటాయింపు రూ.3000 కోట్లు కూడా దాటలేదు. మొత్తమ్మీద కూటమి ప్రభుత్వం కీలక వాగ్దానాలకు రెవెన్యూ జనరేషన్‌కు సంబంధించి సైతం చాలా అంశాలు అసంతృప్తిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విధమైన కేటాయింపులతో ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో సైతం స్పష్టత లేదని వివరించారు.

ఆదిదంపతులకు ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్లకు ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ జరిగింది. శనివారం సాయంత్రం మల్లేశ్వర స్వామికి పంచహారతుల సేవ అనంతరం శ్రీ గంగా పార్వతి(దుర్గ)సమేత మల్లేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. డీఈవో రత్నరాజు పాల్గొన్నారు. అనంతరం శ్రీ గంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులతో ఆలయం చుట్టూ 12 సార్లు ప్రదక్షిణలు చేశారు. ఒక్కో ప్రదక్షిణ అనంతరం ఆదిదంపతులకు అర్చన నిర్వహించి నివేదన సమర్పించారు. రాత్రి మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆది దంపతులకు పవళింపు సేవ జరిగింది. కార్యక్రమంలో వైదిక కమిటీ సభ్యులు రంగావఝల శ్రీనివాసశాస్త్రి, ఆలయఅర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది సుబ్రహ్మణ్యం, చందు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఓపెన్ ఇంటర్ విద్యార్థుల హాల్‌టికెట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆ సంస్థ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు తెలిపారు. ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను వారి గుర్తింపు కార్డులను పరీక్ష కేంద్రంలోని సూపరింటెండెంట్‌కు చూపించి పరీక్షకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. కొంతమంది స్టడీ సెంటర్ల నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను సైతం అనుమతిస్తామని పేర్కొన్నారు.

ఆక్రమణల్లో ఇరిగేషన్ స్థలాలు



కృష్ణానది కరకట్టపై (పున్నమిఘాట్‌కు ఆనుకుని) చేపట్టిన అనధికార కట్టడం

- ఇరిగేషన్, వీఎంసీ అధికారుల ఉదాసీన వైఖరి
- పున్నమి ఘాట్ వద్ద కొనసాగుతున్న అనధికార కట్టడాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణానదీ తీరాన పున్నమి హోటల్ పక్కనే ఉన్న జలవనరుల శాఖ (ఇరిగేషన్)కు చెందిన స్థలం ఆక్రమణలకు గురవుతోంది. ఇరిగేషన్‌శాఖ నిబంధనలను ఖాతరు చేయకుండా ఆక్రమణదారులు అనధికార కట్టడాలను నిర్మిస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే, స్థలం మాది అంటూ బుకాయిస్తున్నారు. అనధికారికంగా షెడ్‌లు, షాపులు నిర్మించి వాటిని అద్దెలకు ఇస్తూ ప్రతినెలా వేలాది రూపాయలను సొమ్ముచేసుకుంటున్నారు. కబ్జాదారులపై స్థానికులు ఫిర్యాదు చేసినా ఇటు ఇరిగేషన్ అటు నగరపాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించకపోవడం వెనుక లోగుట్టు వారికే ఎరుక అంటూ స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

కబ్జా వెనుక కథాకమామిషు ఏమిటంటే..

విద్యాధరపురం హిందూ స్మశానవాటికకు దక్షిణం వైపు గత కృష్ణాపుష్కరాల వరకు షాపుల్లో సాంబ్రాణి పొగవేసి దిష్టి నిమ్మకాయలు, కొబ్బరికాయలు కట్టి జీవనం సాగించే అనేకమంది ముస్లిం మైనార్టీలు గుడిసెలు వేసుకుని నివసించేవారు. కృష్ణా పుష్కరాల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం వారి ఇళ్లను తొలగించి వారికి జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ఇళ్లు ఇచ్చారు. అప్పటి నుంచి ఆ స్థలాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. వాటిపై కన్నేసిన ఓ కుటుంబానికి చెందినవారు అదంతా తమదేనంటూ నెమ్మదిగా ఆక్రమించుకోవడం మొదలు పెట్టారు. వాస్తవానికి ఆస్థలం బ్రిటిష్ పాలనలో ఆర్మీలో పని చేసి రిటైరయిన వారికి ఇచ్చిందని స్థానికులు చెబుతున్నారు. వారి నుంచి ఒక వ్యక్తి స్థలాన్ని లీజుకుని ఇటుకల బట్టీ ఏర్పాటు చేసుకుని కొంత స్థలాన్ని సాంబ్రాణి పొగ వేసే ముస్లిం మైనార్టీలు ఉండేందుకు ఉచితంగా ఇచ్చారు. పుష్కరాల సమయంలో అక్కడ నివసించే పేద ముస్లిం మైనార్టీలు వైఎస్సార్‌కాలనీకి వెళ్లిపోయారు.

వారసులమంటూ ఆక్రమణలు..

గతంలో ఇరిగేషన్ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తి మరణించిన తరువాత అతని వారసులమంటూ కొందరు వ్యక్తులు వచ్చి ముక్కలుముక్కలుగా విడదీసి చుట్టూ ప్రహరీ నిర్మించడం, షెడ్‌లు వేసి అద్దెలకు ఇవ్వడం ప్రారంభించారు. ఇదంతా 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వ పాలనలో యథేచ్ఛగా సాగింది. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారసులమని చెప్పుకున్న వారంతా స్తబ్ధుగా ఉండిపోయారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడు మళ్లీ కబ్జా పర్వం షురూ చేశారు. ఇటీవల కబ్జాదారుల్లో ఒకరు మూడు షాపులు నిర్మించడమే కాకుండా రోడ్డు పక్క ప్రభుత్వ స్థలంలో ఒక కాఫీ షాపు కూడా ఏర్పాటు చేశారు. తమ స్థలానికి పట్టాలు ఉన్నాయని ఆక్రమణదారులు చెబుతున్నా వారు అద్దెలకు ఇచ్చిన ఏ స్థలానికి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎసెస్‌మెంట్ నంబర్, పన్ను లేదు. అంతే కాకుండా అనధికార నిర్మాణాల్లో వ్యాపారాలు చేస్తున్న వారెవరికి ట్రేడ్ లైసెన్స్ లేకపోవడం గమనార్హం.

కలెక్టర్‌కు లేఖ



కలెక్టర్‌కు జలవనరుల శాఖ ఈఈ రాసిన లేఖ

నదీతీరాన అక్రమ కట్టడాలపై జలవనరుల శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ 2023 డిసెంబర్ 27న జిల్లా కలెక్టర్‌కు ఓ లేఖ రాశారు. అయినా ఫలితం లేకపోవడంతో ఇరిగేషన్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ (కృష్ణా మధ్య విభాగం) పీవీఆర్ కృష్ణారావు ఆలేఖను సూచిస్తూ గతేడాది జనవరి 17వ తేదీన జిల్లా కలెక్టర్‌కు మరో లేఖ రాశారు. విద్యాధరపురం పరిధిలో కృష్ణానది ఎడమ వరద కరకట్ట మధ్య భాగంలో మైనంపాటి రామయ్య అనేవ్యక్తి ఏవిధమైన అనుమతులు లేకుండా శాశ్వత కట్టడాలు చేయడం గమనించాం. ఆ స్థలంలో శాశ్వత కట్టడాలు చేపట్టడం రివర్ కన్జర్వెన్సీ చట్టం 1884 ప్రకారం నేరం. అనధికార కట్టడాలను నిలుపుదల చేయాలని కోరుతూ విజయవాడ వెస్ట్ తహసీల్దార్, వీఎంసీ సర్కిల్–1 టౌన్ ప్లానర్, భవానీపురం పీఎస్ సీఐకు ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ (హెడ్‌క్వార్టర్స్ సబ్ డివిజన్) సూచిక లేఖ ద్వారా తెలియ చేశారు. కరకట్ట మధ్య భాగంలో అక్రమ కట్టడాలను నిలుపుదల చేయించేందుకు సంబంధిత అధికారులకు తగు సూచనలు ఇవ్వాలని కోరారు. అయితే ఆయా కబ్జాల వ్యవహారంపై ఉన్నతాధికారులు ఎవ్వరూ ఎటువంటి చర్యలకు ఉపక్రమించలేదు. దీంతో కబ్జాదారులు మరింత రెచ్చిపోతున్నారు. ఇకనైనా ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని కబ్జాదారుల నుంచి ఇరిగేషన్‌శాఖ స్థలాన్ని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యువతరం ఆదర్శంగా నిలవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ కళాశాలలో వెంతూర–2కె25 సాంస్కృతిక ఉత్సవం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చదువులో మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యతో పాటు సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక, రాజకీయ, క్రీడ, కళా రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. పరిపూర్ణమైన వ్యక్తిగా ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు లయోల కళాశాల చేస్తున్న కృషిని అభినందించారు.

బహుమతుల అందజేత..

అనంతరం మరో అతిథి కళారత్న డాక్టర్ సిల్వెస్టర్ స్టాలిన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి నడవడికతో సమాజంలో సమున్నత వ్యక్తులుగా ఎదగాలన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మన దేశ గౌరవాన్ని ఇనుమడింప చేసే విధంగా ఉండాలని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ దేశ ప్రతిష్ఠను కాపాడుకోవాలని తెలిపారు. యువత భారత దేశానికి వెన్నెముక అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సింగింగ్, డ్యాన్స్, స్కిట్స్, తో పాటు వీడియోగ్రఫీ, స్కెచింగ్ వంటి అంశాలను ప్రదర్శించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ సారథి, లయోల కళాశాల డైరెక్టర్ ఫాదర్ జోజి రెడ్డి, ప్రిన్సిపాల్ ఓ.మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద నిరోధకంపై అవగాహన



మంటలను ఆర్పే విధానాన్ని చూపుతున్న ఫైర్ సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): అగ్నిప్రమాదాల సమయంలో వాటిని ఎలా నిరోధించాలి అనే అంశంపై నగరపాలక సంస్థ ఫైర్ ఆఫీసర్లు శనివారం గవర్నర్‌పేటలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని వ్యాపారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవల్సిన నిరోధక చర్యలు, అగ్నిని నిరోధించే పరికరాలను ఉపయోగించే విధానం, మంటలను ఆర్పేందుకు ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్స్ ఎక్కడెక్కడ అమర్చాలి వంటి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా కాంప్లెక్స్ చుట్టూ చేపట్టాల్సిన రక్షణ చర్యలను వివరించారు. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నిర్వహించిన ఈకార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉత్తమ సమాజం సాధ్యం



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, సిద్ధార్థ ఫౌండేషన్ సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్య ద్వారానే ఉత్తమ సమాజాన్ని సాధించగలమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సిద్ధార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 26వ వార్షిక ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం శనివారం రాత్రి మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగింది. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో ప్రతి ఏటా లక్షలాది రూపాయలను విద్యార్థులకు ఉపకార వేతనాలుగా అందజేయడం అభినందనీయమన్నారు. సిద్ధార్థ ఫౌండేషన్ అధ్యక్షుడు మలినేని రాజయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు స్థలాన్ని కేటాయిస్తే అందులో వ్యవసాయ కళాశాల స్థాపిస్తామని చెప్పారు. సిద్ధార్థ ఫౌండేషన్ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది 772 మంది విద్యార్థులకు రూ.66లక్షలను ఉపకార వేతనాలుగా అందజేశామన్నారు. కుల, మతాలకు అతీతంగా ఒకటో తరగతి నుంచి పీజీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని చెప్పారు. సిద్ధార్థ ఫౌండేషన్ సభ్యులతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూటమి బడ్జెట్ అంకెల గారడీ



మీడియాతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్, పక్కన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అంజిరెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు):కూటమి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ అంకెల గారడీలా ఉందని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. ఇది అన్ని వర్గాలను మోసం చేసిన బడ్జెట్ అన్నారు. ఈ బడ్జెట్‌లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. గుణదలలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం దేవినేని అవినాష్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలపై పవన్ కళ్యాణ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా వైఎస్సార్ సీపీపై ఆరోపణలు చేయడం మినహా చేసిందేమీ లేదన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలన, ప్రస్తుత కూటమి పాలనపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, మీరు సిద్ధమా అని ప్రశ్నించారు. కూటమి పాలనలో గ్రూప్ 2 అభ్యర్థులను ఇబ్బందులు పెట్టారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ తాము అండగా నిలుస్తామన్నారు.

కోగంటి సత్యం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

రాహుల్ హత్య కేసులో జైలుకి వెళ్లి వచ్చిన కోగంటి సత్యం ఇప్పుడు తమ పార్టీ నేతలపై ఆరోపణలు చేయటం తగదన్నారు. హత్యకు గురైన రాహుల్ తల్లిదండ్రులు కూడా జరిగిన విషయం చెప్పారన్నారు.

సూపర్ సిక్స్ పేరుతో మభ్యపెట్టారు: మేయర్ భాగ్యలక్ష్మి

సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం మోసం చేసిందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాలకి ఎంత కేటాయించారో ప్రజలు గమనించాలన్నారు. పింఛన్లపై ఎందుకు సర్వే చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తీరుతో పింఛన్ లబ్ధిదారులు భయాందోళనలకు గురి అవుతున్నారన్నారు. మహిళలను ఉచిత గ్యాస్ సిలిండర్ పేరుతో మోసం చేశారని, నమ్మి ఓటు వేస్తే వెన్నుపోటు పొడిచారన్నారు. అమ్మఒడి, చేయూత, చేదోడు, భరోసా లాంటి పథకాలు కూటమి హయాంలో కనుమరుగయ్యాయన్నారు. పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.అంజిరెడ్డి మాట్లాడుతూ కోగంటి సత్యం, విజయ్ నైతిక విలువలు అందరికీ తెలుసన్నారు.

ఐఓటీలో విస్తృత ఉపాధి అవకాశాలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ద్వారా విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని సెన్స్ సెమీ కండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్ సీఈవో సుధీర్‌రెడ్డి తెలిపారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కంప్యూటర్స్, డేటా సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో 'భవిష్యత్‌ను ఐఓటీతో నిర్మించడం' అంశంపై మూడు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఐఓటీతో పాటుగా సెమీ కండక్టర్ టెక్నాలజీ రంగాలకు సంబంధించి విస్తృతమైన పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. అలాగే సమాజానికి అవసరమైన అనేక ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయని వివరించారు. ఈ రంగానికి సంబంధించిన విద్యార్థులు మరింత పట్టు సాధించి ఆయా అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వారివారి రంగాల్లో వస్తున్న నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా వస్తున్న ఆవిష్కరణలపై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

బాబు భజన తప్ప సంక్షేమం శూన్యం

వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్



మాట్లాడుతున్న పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తం చంద్రబాబు భజన తప్ప అందులో సంక్షేమం, అభివృద్ధికి నిధులు శూన్యమని వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్ విమర్శించారు. విజయవాడలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల హనీమూన్‌ను పూర్తి చేసుకొని బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. ఈ బడ్జెట్ ద్వారా ప్రభుత్వం ప్రజల నోట్లో మట్టికొట్టిందన్నారు. ఆకాశంలో ధృవ నక్షత్రం ఎలా కనపడదో సూపర్‌సిక్స్ సైతం బడ్జెట్‌లో కనపడటం లేదన్నారు. సంపద సృష్టించటం చేతకాదని, అప్పులే చేస్తామంటూ బడ్జెట్ ద్వారా కూటమి ప్రభుత్వం స్పష్టం చేసిందని ఎద్దేవాచేశారు. బడ్జెట్ సందర్భంగా కూటమి నాయకులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విషం చిమ్మే ప్రయత్నం చేశారన్నారు. అభివృద్ధి ఎలా.. చేయాలో, సంక్షేమం ఏ విధంగా అమలు చేయాలో చేతకాక జగన్‌పై విమర్శలు చేశారన్నారు. పేద ప్రజల జీవితాల్లో నవరత్నాల పేరుతో వెలుగులు నింపడం ఆర్థిక విధ్వంసమా? అని ప్రశ్నించారు. నవరత్నాలను జగన్ అమలు చేసినప్పుడు మీరు సూపర్ సిక్స్ ఎందుకు అమలు చేయలేకపోతున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 1.04లక్షల వేల కోట్ల అప్పులు, రూ.32 వేల కోట్లు కేంద్ర సహకారం, పన్నేతర ఆదాయం రూ.19 వేల కోట్లు అదనంగా రావాలని..అవి వస్తే సంక్షేమం ఇస్తామని బడ్జెట్ ద్వారా చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే లక్ష కోట్లు అప్పులు చేశారని, మరో లక్షా నాలుగు వేల కోట్లు అప్పు చేస్తామని చెప్పారన్నారు. రాష్ట్రంలో జగన్ నిర్మాణం చేసిన పోర్టులు, మెడికల్ కాలేజ్‌లు, రైతు భరోసా కేంద్రాలు చూసే అప్పులు వస్తున్నాయని వివరించారు. జగన్ అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి ప్రజల జీవన ప్రమాణాలు పెంచారన్నారు. మైక్రోసాఫ్ట్, జిందాల్, రిలయన్స్, ఆదాని వంటి కంపెనీలు పెట్టుబడులు పెట్టారని అది అభివృద్ధి కాదా అని సూటిగా ప్రశ్నించారు. ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి అంతే స్థాయిలో ఉద్యోగులను నిరుద్యోగులుగా మార్చేశారన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50ఏళ్లకు పెన్షన్, పంటల బీమా తదితర హామీలకు మంగళం పలికారన్నారు.జనసేన నేత టి.జి.విశ్వ ప్రసాద్‌కు 1200 ఎకరాలు ఏ విధంగా కేటాయించారో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. నియోజకవర్గంలో 100 మందికి రూ.10 లక్షలు ఇస్తామని పవన్ చెప్పారని అది బడ్జెట్‌లో ఎక్కడ కనిపించలేదన్నారు. అప్పులు చేసి మునలమ్మ సైతం అమరావతి నిర్మాణం చేస్తుందని చంద్రబాబు చేయడం ఏమి అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో అభివృద్ధి కన్నా దోపిడినే అధికంగా కనిపిస్తోందని విమర్శించారు. సమావేశంలో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వంశీరామరాజు సామాజిక సేవలు వెలకట్టలేనివి



విజయవాడకల్చరల్: కళాపోషకుడు, ప్రజాబంధు వంశీరామరాజు సామాజిక సేవలు వెలకట్టలేనివని శారదా కళాసమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు అన్నారు. స్వరలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో 50 ఏళ్లుగా సామాజిక, సాహిత్య, సేవా రంగాలకు సేవలను అందిస్తున్న వంశీరామరాజుకు స్వరకంకణ ప్రదానం, సినీ సంగీత విభావరి శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శంకరరావు మాట్లాడుతూ.. వంశీరామరాజు దేశంలోని వివిధ ప్రాంతాల్లో వేలాది కార్యక్రమాలను నిర్వహించారన్నారు. వేగ్నేశ ఫౌండేషన్ ద్వారా పేద మధ్యతరగతి కుటుంబాల వారికి సేవలను అందించారు.ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ భాషా వికాసానికి కృషి చేయాల్సిన అవసరముందన్నారు. విశ్రాంత న్యాయమూర్తి టి.వేణుగోపాలరావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ తదితరులు వంశీరామరాజు సేవలను వివరించారు. నిర్వాహకులు వంశీరామరాజుకు స్వర్ణ కంకణాన్ని ప్రదానం చేశారు. గాయనీ గాయకులు టి.బాల కామేశ్వరరావు, వైఎస్ రామకృష్ణ, పి.శాంతిశ్రీ, జి.ఇందునయనలు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. స్వరలయ కార్యదర్శి ప్రభాకర్ నిర్వహించారు.

5 నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఈ నెల 5వ తేదీ నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, కట్టింగ్ అండ్ టైలరింగ్, డ్రస్ డిజైనింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, మిర్రర్ వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రీకల్ టెక్నీషియన్, ఎయిర్ కండీషనర్ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిజం, స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్‌ల తయారీ, బాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్స్ మొదలైన అంశాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తిగలవారు మొగల్రాజపురం రావిచెట్టుసెంటర్‌లో ఉన్న తమ కార్యాలయంలో లేదా 0866–2470420 ఫోన్‌నంబరులో కాని సంప్రదించాలని పూర్ణిమ కోరారు.

నేడు జర్నలిస్టులకు ఉచిత వైద్యపరీక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానిపురంలోని శ్రీభవానీ హాస్పిటల్‌లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఆదివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ ఎండీ వెనిగళ్ల చంద్రశేఖర్, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ దిలీప్‌కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు బ్లడ్ షుగర్ ఫాస్టింగ్, క్రియాటినిన్, హెచ్‌బీ ఏ1సీ, ఈసీజీ, బీఎండీ, ఊపిరితిత్తులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మధురంగా సాగిన గాత్ర సంగీత కచేరి



సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్న లావణ్య కస్తూరి

విజయవాడకల్చరల్: కంచికామకోటి పీఠపాలిత శారదా చంద్రమౌళీశ్వర శ్రీ వెంకటేశ్వర స్వామి ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రవాసాంధ్ర సంగీత విద్వాంసురాలు లావణ్య కస్తూరి నిర్వహించిన సంగీత గాత్ర కచేరీ మధురంగా సాగింది. రఘునాయక, యదుకుల నందన, ముద్దుగారే యశోద శ్రీ రామచంద్రయా మంగళం కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్ వేణువుపై ఇంద్రకీలాద్రిశర్మ, మృదంగంపై చదలవాడ సూర్యనారాయణ వాద్య సహకారం అందించారు. కార్యక్రమాలను చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం బాధ్యులు సి.రామ్మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా లావణ్య కస్తూరి సంగీత సేవలను వివరించారు. విదేశాలలో సైతం సంగీత కార్యక్రమాలను నిర్వహించారన్నారు. వందలాది మందికి సంగీతంలో శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ పరమాత్ముని రామారావు పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులు విష్ణు సహస్రనామ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



భవానీపురం(విజయవాడపశ్చిమ):స్థానిక ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని విజయవాడ రవీంద్రభారతి జాబిల్లి క్యాంపస్‌లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ఆహూతులను ఆలోచింపచేసింది. కుంభమేళా, చుక్‌చుక్ రైల్, పెన్సిల్ రైమ్స్, బ్యారేజి, చంద్రబింబ ఆవర్తనాలు, తెలుగుతల్లి, టైప్స్ ఆఫ్ నెట్‌వర్క్స్ ఇన్ కంప్యూటర్స్ వంటి ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థుల సృజనాత్మకతను పలువురు ప్రశంసించారు. రవీంద్రభారతి విద్యా సంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్ అంతా విజ్ఞానశాస్త్రంతోనే ముడిపడి ఉందని, ఈ దిశలో సైన్స్‌పై విద్యార్థులలో ఆసక్తిని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అకడమిక్ డీన్ శాంతి మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన వివిధరకాల ప్రాజెక్ట్ నమూనాలు వారిలోని ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పీ సునీత, జాబిల్లి హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ కిరణ్మయి, క్యాంపస్ ఇన్‌చార్జ్ ప్రభాకర్‌బాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతగా ఈటె అనిత వ్యవహరించారు.